గురువులు.. విజ్ఞాన దీపాలు

• మండలంలో ఆరుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు • జవహర్ మున్నీర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రొద్దుటూరు కల్చరల్ : అజ్ఞానాంధకారాన్ని తొలగించి విజ్ఞాన దీపాలు వెలిగించేది గురువులు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని గురుపూజోత్సవంగా జరుపుకొంటూ విద్యాభివృద్ధికి విశేష కృషిచేసిన పలువురు గురువును అవార్డులను అందిస్తుంటారు. ఈ ఏడాది ప్రొద్దుటూరు మండలానికి ఒక రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఐదు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి.



జవహర్ మున్నీర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రొద్దుటూరు మండలం లింగారెడ్డి నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ జవహర్ మున్నీర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. బీఎస్సీ బీఈడీ చేసిన ఈమె 1998 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారు. చాపాడు మండలం లక్ష్మీపేట మండల పరిషత్ పాఠశాలలో 2021లో నాడు–నేడు పనులను తక్కువ ఖర్చులో పనులు చేసినందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్నారు. నాడు–నేడు పనుల కోసం ఆమె రూ.10.30 లక్షల నిధులను ఖర్చు చేశారు. ప్రభుత్వం రూ.7 లక్షల బిల్లును చెల్లించగా మరో మూడు లక్షలు రావలసి ఉన్నా ఆమె ఆనిధులను వదులు కున్నట్లు తెలిపారు. తన కుమార్తె ఒలివా సహృదయరాణి పాఠశాలలో రూ.50వేలుతో సరస్వతీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 2023లో లింగారెడ్డి నగర్ పాఠశాలకు బదిలీపై వచ్చి అక్కడే పనిచేస్తున్నారు. ఆమె భర్త వరప్రసాద్ ఉపాధ్యాయుడే. ఈమె తండ్రి ఎంఎస్ మస్తాన్‌వలి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, తల్లి రహమతున్నీసా బేగం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు.


విద్యార్థులకు టీఎల్ఎం విధానంలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు షేక్ జవహర్ మున్నీర్

ఏవీ.సుచిత్ర కుమారి..



విరాట్‌నగర్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు ఏవీ సుచిత్రకుమారి 28 ఏళ్లగా విద్యార్థులకు టీఎల్ఎం విధానం ద్వారా విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నారు. ఈమె 1997లో ఎమ్మిగనూరు కందనాతి గ్రామంలో ఎస్జీటీగా చేరి 2000లో కాకిరేనిపల్లె, 2008లో వెదురూరు, 2017లో చిన్నగురువలూరు, 2020లో చాడూరు ఎంపీయూపీఎస్ విధులు నిర్వహించి 2023లో విరాట్ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, ఆన్‌లైన్ ద్వారా విద్యాబోధన చేస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు.

వీవీ గాయత్రి..



స్థానిక శ్రీకొట్టి చిన్నవెంకటసుబ్బయ్య ఎయిడెడ్ హైస్కూల్ మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు వీవీ గాయత్రి తనదైన శైలిలో విద్యార్థులకు బోధన చేస్తూ తల్లిదండ్రుల మన్ననలను పొందుతున్నారు. ఈ పాఠశాలలో ఈమె 27 ఏళ్లగా మ్యాథ్స్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఈమె తన సొంత డబ్బులతో పదో తరగతిలో ప్రథమ బహుమతి రూ.2,116, ద్వితీయ బహుమతి రూ.1,116, తృతీయ బహుమతి రూ.516 విద్యార్థులకు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. అలాగే విద్యార్థులకు యూనిఫాం, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. పదో తరగతిలో ఫీజు చెల్లించలేని పేద విద్యార్థులకు ఫీజు చెల్లిస్తున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతులను బోధిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ వార్డు రావాడం పట్ల వీవీ గాయంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

పోచమిరెడ్డి గాయత్రి..



మండలంలోని కాకిరేణిపల్లె ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పోచమిరెడ్డి గాయత్రి పనిచేస్తున్నారు. 2008 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి పోచమిరెడ్డి గాయత్రి అడుగు పెట్టారు. తల్లిదండ్రులకు నచ్చచెప్పి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందిస్తూ వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ వార్డు రావాడం పట్ల పోచమిరెడ్డి గాయంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

సయ్యద్ బాషా..



పెన్నానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లీషు ఉపాధ్యాయుడు సయ్యద్ బాషా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈయన 2002లో రాజుపాళెం మండలం వెలవలి ఎంపీపీ పాఠశాలలో, 2011లో పెన్నానగర్ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. అప్పుడు 20 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారు. 2013లో మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చడంతో విద్యార్థుల సంఖ్య 90కి చేరింది. ఈ పాఠశాల 2017లో అప్పర్ ప్రైమరీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. 2023లో హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావడంతో విద్యార్థుల సంఖ్య 200కు చేరుకుంది. విద్యార్థులకు మంచి విద్యను అందించడంతోపాటు తల్లిదండ్రులకు భరోసాను ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను చదువుకునేలా సయ్యద్ బాషా ప్రోత్సహించారు.

క్లుప్తంగా

ఎంఎస్ఎంఈ పథకాలపై అవగాహన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కేసీ పుల్లయ్య నైపుణ్యాభివృద్ధి కేంద్రం గురువారం ఎంఎస్ఎంఈ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పథకాలను ఉపయోగించుకుని ఔత్సాహికులు ఎంటర్‌ప్రైన్యూర్‌గా ఎదగాలని తెలిపారు. శిక్షణ అనంతరం స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ ఐపీఓ శైలజ, జిల్లా పశువుల అభివృద్ధి అధికారి రామాంజనేయులు, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ఉపయోగించుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని తెలిపారు. ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోందని, వాటి గురించి వివరించారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వద్ది సురేఖ, వైస్ చైర్మన్‌గా పట్నం లక్ష్మణ్ కుమార్, మార్కెట్ కమిటీ మెంబర్లుగా జి.నరసింహారావు, ఎం.నాగేంద్రమ్మ, వి.సుధాకర్, వై.దిలీప్‌కుమార్‌రెడ్డి, వి.పద్మలత, ఆర్.మాబు షరీఫ్, ఇంతిరెడ్డమ్మ, బొగ్గారపు వెంకటేశ్వర్లు, వనం రమాదేవి, మార్తల రాధా, ముత్యాల పద్మజ, నక్కా రాజీ, కె.సుమలతలను నియమించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచన మేరకు మార్కెట్ కొత్త కమిటీ పాలక వర్గాన్ని నియమించారు. త్వరలో వీరు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ/ఎయిడ్స్ కార్యక్రమంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. లింక్ వర్కర్ స్కీం జెడ్ఎస్ దర్బార్ వలి మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, సురక్షితం కాని లైంగిక చర్యల వల్ల సంక్రమిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కీర్తిదాయిని, లింక్ వర్కర్ స్కీం సీఎల్‌డబ్ల్యూ సురేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు

కలసపాడు : కలసపాడు, సిద్ధమూర్తిపల్లె గ్రామాల మధ్య టైలర్స్‌కాలనీలో గురువారం వీధికుక్క దాడిలో అదే కాలనీకి చెందిన షేక్ మౌలాలి, వహీదల కుమారుడు ఇమ్రాన్ అనే మూడేళ్ల బాలుడు గాయపడ్డాడు. ఇమ్రాన్ తన ఇంటి ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధికుక్క బాలుడిపై దాడి చేసి లాక్కెళుతుండగా తల్లిదండ్రులు గమనించి వీధికుక్క నుంచి కాపాడారు. బాలుడి ముఖంపై వీధికుక్క గాయపరిచింది. గాయపడిన బాలుడిని పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

నాయీబ్రాహ్మణుల ఆందోళన

పోరుమామిళ్ల : పట్టణంలోని నాయీబ్రాహ్మణులు గురువారం ఆందోళన నిర్వహించారు. అనంతరం సీఐ డి.శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి నాయీబ్రాహ్మణులు కటింగ్ షాపులను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే వేరే కులస్తులైన అట్లూరు మండలానికి చెందిన యల్లారెడ్డి పట్టణంలో కటింగ్ షాప్ ఏర్పాటు చేస్తుండటంతో తమ వృత్తికి ఆటంకం కలిగిస్తున్నారని, దీంతో తమ కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

బద్వేలు అర్బన్ : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ధ్యానమని చిన్మయ మిషన్ కడపశాఖ అధ్యక్షుడు స్వామితురియానందసరస్వతి పేర్కొన్నారు. స్థానిక రాచపూడి నాగభూషణం ఫంక్షన్ హాలులో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న భగవద్గీత సప్తాహ ప్రవచన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ శరీరంతో పనిచేసే శ్రమ విలువ కన్నా మనస్సుతో చేసే శ్రమకు అధిక విలువ లభిస్తుందని, అలాగే శరీరంతో, బయట ఇంద్రియాలతో చేసే పూజల కన్నా మనస్సుతో భగవంతుని ధ్యానం చేయడం అత్యంత విలువైనదని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

అట్లూరు : మండలంలోని వరికుంట గ్రామంలో గురువారం కేంద్ర ప్రభుత్వ పథకలపై ఏపీజీబీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ మేనేజర్ దుష్యంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ ఉపయోగాలను, పీఎంఎస్‌బీఐ, పీఎంజేజేబీవై, ఏపీవై, పీఎంజేడీఐ, ఈ–కేవైసీ, డిజిటల్ మోసాలను వివరించారు. ఏపీజీబీ రైతులకు, డ్వాక్రా మహిళలకు, చిరు వ్యాపారులకు విరివిగా రుణాలు అందిస్తోందన్నారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో, బ్యాంక్‌లో కానీ ఇన్సూరెన్స్ లేని వారు చేసుకోవచ్చని సూచించారు. సర్పంచ్ రమణ, బీసీ నారాయణ, ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ రాయుడు, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు సిద్ధారెడ్డి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ఐ ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక


రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ


రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన అయ్యవారిపల్లె హైస్కూల్ విద్యార్థులు

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ఐ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వేళాంగ్ కుమార్, పీడీ షేక్ అల్లాబకాష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు జార్జికారొనేషన్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–14, 17 ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి కె.గురునాని. 9వ తరగతి విద్యార్థినులు ఎస్.రింషా, బీసీ పల్లవి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు వచ్చే నెలలో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతి చూపి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

చాపాడు : ఈనెల 10న ప్రొద్దుటూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి అండర్ 14, 17 ఫెన్సింగ్ పోటీలలో మండలంలోని అయ్యవారిపల్లె హైస్కూల్‌కు చెందిన ఐదు మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్– 14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న బి.సుస్మిత, పి.సమీరున్ బీ, బి.వెంకటగోవర్ధన్, అండర్–17 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని వై.వెంకటపల్లి, పదో తరగతి విద్యార్థి కె.వికాస్ జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు హెచ్ఎం గోపీనాథ్, ఫిజికల్ డైరెక్టర్ శివారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

ప్రొద్దుటూరు రూరల్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. నాగాయపల్లెలో గురువారం ముందస్తు వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఇందులో భాగంగా గ్రామంలో లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో జ్వర లక్షణాలను ఉన్న 8 మందికి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సీజన్‌లో వర్షాలు పడటం, ఇంటి పరిసరాల్లోని గుంతల్లో నీరు నిలబడటం వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అబేట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు యశోధ, రత్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, గ్రామ నాయకులు వెంకటసుబ్బయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సభ ఎన్నికలపై కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు



మాట్లాడుతున్న న్యాయవాది నాగరాజేష్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు ఆర్యవైశ్యసభ ఎన్నికలపై ప్రొద్దుటూరు సెకండ్ అడిషనల్ జిల్లా కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చిందని న్యాయవాది నాగరాజేష్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సభ 2025–28 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గం ఎన్నికకు సంబంధించి అవకతవకలు జరగడంపై జిల్లా కోర్టుకు వెళ్లామన్నారు. ఈ మేరకు నూతన కార్యవర్గం ఎక్కడా అధికారికంగా ప్రకటించుకోరాదని తీర్పు చెప్పిందన్నారు. 24 వర్గాల్లో ఏ వర్గంలోనూ కొత్త సభ్యులను, ఓటర్లను చేర్చుకోరాదన్నారు. ఆడిటర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదుల వర్గంలో నకిలీ ఓటర్లు ఉన్నారని కోర్టు దృష్టికి తేవడంతో ఈ వర్గానికి సంబంధించిన సభ్యుల నుంచి ఎటువంటి రుసుం వసూలు చేయరాని కోర్టు స్పష్టం చేసినట్లు వివరించారు.

విధినిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఫారెస్టు సిబ్బంది

పోరుమామిళ్ల : విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజ్ అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. గురువారం జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎఫ్ఆర్ఓ ఆధ్వర్యంలో అటవీశాఖలో విధినిర్వహణలో స్మగ్లర చేతిలో అశువులు బాసిన అమరవీరులకు పోరుమామిళ్ళ రేంజ్ సిబ్బంది నివాళులర్పించి వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకొని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించి అటవీ సంపదను కాపాడుతూ మన కుటుంబాలను గుర్తు చేసుకొని ఉన్నత అధికారులకు తగిన సమయంలో సమాచారం అందించి స్మగ్లర్లు నుండి మన ప్రాణాలు కూడా కాపాడుకోవలసిన బాధ్యత ఉందన్నారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సెక్షన్ అధికారులు రమణ, రమణయ్య, డాగ్ స్క్వాడ్ హసన్ భాష, బీట్ అధికారులు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం సభ విజయోత్సవం సిగ్గుచేటు


రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

ఖాజీపేట : అనంతపురంలో జరిగిన సూపర్‌సిక్స్ సూపర్ హిట్ సభ ఆపరేషన్ సక్సెస్–పేషంట్ డెడ్‌లా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఖాజీపేట మండలం దుంపలగట్టులోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్న సభ ఆత్మస్తుతి–పరనిందలా ఉందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తగుదునమ్మా అంటూ సూపర్ హిట్ అని మాట్లాడడం తగదన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో తాము ఘన విజయం సాధించామని ప్రగల్భాలు పలకడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

నేడు యూరియా పంపిణీ

ప్రొద్దుటూరు రూరల్ : పట్టణంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణాల యజమానుల వద్ద యూరియా అందుబాటులో ఉందని శుక్రవారం మండలంలోని యూరియా అవసరైన రైతులు తీకెళ్ల వచ్చని మండల వ్యవసాయాధికారి వరహరికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నాలుగు ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు 62 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని ఆయన తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహాలక్ష్మి, కేవీఎస్ఆర్, మనగ్రోమోర్ సెంటర్, సుబ్బారెడ్డి ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలోనే మండలంలోని మరికొన్ని రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తుందన్నారు.

నేడు ఎగ్జిబిషన్ వేలం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నడుపుకొనుటకు టెండర్–కం–బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

పుస్తకాల పంపిణీ

కాశినాయన : మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాలలో గురువారం రుతుక్రమంపై ప్రిన్సిపాల్ మెర్సిరాణి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు ముద్దమందారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 11 నుంచి 13 ఏళ్ల బాలికలకు రుతక్రమం అనేది సాధారణమని, ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు. విద్యార్థినులు ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

మైదుకూరు : మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనతో, మండల న్యాయ సేవాధికార సంస్థ నిర్వహిస్తున్న ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. రాజీ అయ్యే అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ ఇతర కేసులను పరస్పర అంగీకారంతో సెటిల్‌మెంట్ చేసుకోవాలని సూచించారు. కక్షిదారులు న్యాయవాదులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులను సంప్రదించి లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

పదోన్నతులు కల్పించండి

మైదుకూరు : గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ గురువారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నిరంజన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బి.రమణారెడ్డి, టి.వినీత్, ఆర్.నరసింహా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మైదుకూరు : చైన్ స్నాచర్ల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ కె.రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది రోజులుగా మండలాల్లో చైన్ స్నాచింగ్, ఇళ్లల్లో చోరీ సంఘటనలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తాము నివాసం ఉంటున్న పరిసర ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే 112 పోలీస్ టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. బంగారు ఆభరణాలను ధరించి మహిళలు వాకింగ్‌కు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఒంటరిగా ఉన్న మహిళల వద్దకు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఏదైనా అడ్రెస్ అడుగుతున్నట్లు లేదా ఏదైనా విషయం గురించి మాట్లాడుతున్నట్లు చేస్తే వారి దగ్గర నుండి వెంటనే జనాలు ఉన్న దగ్గరకు వెళ్లాలని సూచించారు. సెలవుల్లో గ్రామాలకు వెళ్లే వారు ఇంటిలో ఎలాంటి విలువైన బంగారు, వెండి, డబ్బు ఉంచరాదని, తమ వెంటే తీసుకెళ్లాలని తెలిపారు. ఏదైనా గ్రామాలకు వెళ్లే సమయంలో ఇంటికి తాళాలు వేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు. మోటార్ బైక్‌లను ఎక్కడైనా పార్కింగ్ చేసేటప్పుడు తప్పకుండా సైడ్ లాక్ వేయాలన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

అట్లూరు : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు పోరుమామిళ్ల ఎస్టీయూ భవన్‌లో పోరుమామిళ్ల రీజియన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.పరిమళ జ్యోతి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు కలసపాడు మండలానికి చెందిన సత్యనారాయణ, వీరారెడ్డి, ఎస్ఏ కాశినాయన మండలానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి, రాధిక, ఖాసీంవలి, బి.కోడూరు మండలానికి చెందిన శ్రీనివాసులు, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, పోరుమామిళ్ల మండలానికి చెందిన జనార్దన్‌సెట్టి, గురయ్య, వెంకటసుబ్బన్న, బి.మఠం మండలానికి చెందిన గురయ్య, శ్రీనివాసులు, స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులుగా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.బాలుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్లుకు శాలువా, పూమాల, మెమెంటోలతో ఘనంగా సన్మించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి నిరంకుశ ధోరణిలో ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల, బి.కోడూరు, ఎస్ఏ కాశినాయన మండలాల ఎంఈఓలు వెంకటయ్య, కొండిశెట్టి, రాజశేఖర్‌రెడ్డి, సునీల్ కుమార్, మహమ్మద్ షఫీ, ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ వీవీ కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు రవికేశవరావు, చంద్రహాసరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్ బాబు, పులాల్రెడ్డి, వెంకటరామయ్య, రాజగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, సీనియర్ నాయకులు బాలరాజు, వాకా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు


బ్లాక్ బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ హరినారాయణ

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌వీ తైక్వాండో అకాడమీకి చెందిన 12 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు సాధించారు. కె.జీవన, కె.భరద్వాజ్, వి.శివశంకర్‌రెడ్డి, ఎం.హరీశ్వర్‌రెడ్డి, ఎం.నీరజ, ఎం.చాతుర్య, ఆర్.తేజస్విని, పి.ముని చరిత, ధనిక, సురార్చిత, నారాయణ మూర్తి, సూర్యనారాయణలు బ్లాక్ బెల్ట్‌లు సాధించినట్లు అకాడమీ కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందంచారు. చిన్న వయసు నుంచి పెద్ద వయసు వరకు, మహిళలకు వేర్వేరుగా తైక్వాండో అకాడమీలో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాస్టర్ శ్రీనివాసులు దగ్గరుండి పర్యవేక్షించి అందరికి శిక్షణలో నైపుణ్యాలు నేర్పిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రొద్దుటూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కోఆర్డినేటర్ గౌరీశంకర్, మాస్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ స్పోర్ట్స్ రిజర్వేషన్ కింద విద్య, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులు యూనివర్సిటీ టోర్నమెంట్‌లో మెడల్ సాధించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పృధ్వీనారాయణ, కడప శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి


తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, అదే సంవత్సరంలో నోటిఫికేషన్ విడుదలైన పోలీసులు, గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని 2003 డీఎస్సీ ఫోరం నాయకులు జయసుబ్బారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి మహానిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన పెన్షన్ విధానం అమలు తేదీ 1-9-2004 కు ముందు నియామక నోటీఫికేషన్ విడుదలై తర్వాత నియామకం జరిగి కొనసాగుతున్న సుమారు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, సి.రామచంద్రారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్, పీఆర్‌టీయూ నాయకులు నజీంబాష, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవిశంకర్, చెన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి


ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రొద్దుటూరు రూరల్ : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ మస్తాన్, పట్టణ కన్వీనర్ నాగార్జున డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు గురువారం మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పేదరిక నిర్మూలనలో భాగంగా ఇప్పటికే పేదరికంలో ఉన్న సచివాలయ ఉద్యోగులను పీ4 సర్వేకు మ్యాప్ చేయడం, ప్రత్యేకంగా క్లస్టర్లు కేటాయించడం అన్యాయమన్నారు. వలంటీర్లు చేయాల్సిన విధులన్నీ ఉద్యోగులతో చేయించడం ఎంత వరకు న్యాయమన్నారు. ప్రతి ఏడాది వలంటీర్లకు గత ప్రభుత్వం రూ.3 వేలు కోట్లు ఖర్చు చేసేదని, ప్రస్తుతం ఆ డబ్బు రాష్ట్ర ప్రభుత్వానికి మిగులుతున్నాయన్నారు. కనీసం రూ.450 కోట్లు విలువైన నేషనల్ ఇంక్రిమెంట్ ప్రభుత్వం ఇవ్వలేకపోవడం దారుణమన్నారు. మంత్రులు, ముఖ్యమంత్రి దీనిపై ఆలోచించాలన్నారు. ఏ ఉద్యోగి అయినా తమ ఉద్యోగాలను మాతృశాఖలో విలీనం చేయాలని అడగడం సహజమైన అంశమని, దాన్ని కూడా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సచివాయల ఉద్యోగుల జేఏసీ ప్రొద్దుటూరు మండల కన్వీనర్ హర్ష, అన్ని సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.